




## (గత సంచిక తరువాయి)

**ఆకాశరామన్న** నాటకాన్నీ, మహానటుడు కె. వెంకటేశ్వరరావు నటనా వైదుష్యాన్నీ విభ్రమంతో చూస్తూ సైడు కర్టెనులోంచి చూస్తున్నాను. నటనతో అంత ఉద్రూతలూగించిన సందర్భం నా జీవితంలో అంతకు ముందు లేదు. అలాగే మైకంలో ఉన్న నన్నూ, మరికొందర్నీ స్టేజి మీదకి తోశాడు వెంకటేశ్వరరావు. సైడ్ కర్టెన్‌లోకి వచ్చి వెంకటేశ్వరరావుతో నేనెప్పుడూ జీవితంలో నటించిన గుర్తులేదు. కాని ఓ నటరాజు నటనా వైదుష్యాన్ని అంత దగ్గరగా, అంత తన్మయత్వంతో చూసిన సందర్భమూ అంతకు ముందూ, ఆ తర్వాతా ఎప్పుడూ గుర్తులేదు. ఓ లారెన్స్ ఆలీవియర్. ఓ రిచర్డ్ బర్టన్, ఓ పాల్ ముని (ఈ గుర్తులన్నీ తర్వాతి దశలో నేను పెట్టుకున్నవి) అందర్నీ కలిపి పోతపోస్తే ఆనాటి వెంకటేశ్వరరావ్ అవుతాడు.

ఆ పోటీలలో నిస్సందేహంగా ఉత్తమ నటుడు వెంకటేశ్వరరావే. ఆనాడే కాదు – తన జీవితమంతా ఉత్తమ నటుడు వెంకటేశ్వరరావే. శ్రీనివాస చక్రవర్తిగారు న్యాయనిర్ణేతల్లో ఉండడం మాత్రం గుర్తు. ఆఖరి రోజు విశ్వనాథ సత్యనారాయణగారు వచ్చారు. ఉత్తమ రచన 'పంజరం' నాటకానికి అవసరాల సూర్యారావుగారికి ఇచ్చారు. 'పంజరం' ఉత్తమ ప్రదర్శంగా బహుమతి పుచ్చుకుంటుందని చాలామంది ఆశించారు. కాని రచనతో ఆగిపోయింది. ఆ నిరుత్సాహం, ఆశాభంగం 'అవసరాల'లో స్టేజిమీద కనబడింది. ఆ చెక్కునందుకుంటూ సూర్యారావుగారు ఏవో పద్యాలు అందుకున్నారు స్టేజి మీద. న్యాయ నిర్ణయంలో ఏవో అసంతృప్తులూ, రాజకీయాలూ ఉన్నాయేమో తెలీదు. విశ్వనాథవారు సూర్యారావుగారిని భుజం మీద చెయ్యేసి వేదిక దింపడం గుర్తు.

ఆ ఉత్సవాల మత్తునుంచి నేను జీవితంలో ఏనాటికీ తేరుకోలేకపోయాను. భోజనాల దగ్గర జె.వి.సోమయాజులు, రమణమూర్తి, వెంకటేశ్వరరావు, కొ(్రపాటి, జి.నిర్మల, పొట్టి ప్రసాద్, రాధాకుమారి వీరందరూ ఐడల్స్. వీరిని చూడడం ఓ అనుభవం. సంవత్సరాల తర్వాత సినిమాల్లో మేం సాధించిన గ్లామరు వీళ్ళముందు దిగదుడుపు. నాటకరంగానికి ఉన్న బలం అది. ఉన్న ఆకర్షణ అది. ఉన్న ఆత్మీయత అది. అది నిస్సందేహంగా ఔత్సాహిక నాటకరంగానికి స్వర్ణయుగం.

ఇప్పుడిప్పుడు సినిమా వేపు మెడసారించే రచనలు, మద్రాసులో మాయమవుదామని తహతహలాడే రచయితలూ, నటుల్ని మూర్ఛబిళ్ళలాగ ముందుకు త్రోయడానికి కంకణం కట్టుకున్న 'ఏకనట యితివృత్తాల' నాటకాలూ క్రమంగా సినిమా ప్రక్రియని అతిపేలవంగా రంగస్థలం మీద అనుకరించే నాటకాలు వస్తున్నాయి. కానీ ఆనాటి నాటకరంగం ఫక్తు 24 కారెట్ల మేలిమి బంగారం.

అమెరికా బ్రాడ్వేలోనూ, ఇంగ్లండు వెస్టెండ్‌లోనూ ఎవరికీ తీసిపోని ప్రదర్శనలు. అయితే ఆ ఔన్నత్యాన్ని ఉద్యమం చేసే ప్రణాళికలేని కారణంగా అప్పటికీ ఇప్పటికీ ఔత్సాహిక నాటకరంగంలో 'ఉత్సాహమే' మిగిలింది. 'ఉద్ధతి' వెనక బెంచీలోనే నిలిచిపోయింది.

ఔత్సాహిక నాటకాన్ని ఏ కాస్తో 'వ్యాపారం' చేసి 'ఆకాశరామన్న'ని వరసగా 40 ప్రదర్శనలు యిప్పించగల ఆండ్రూ లాయడ్ వెబ్బర్, సర్ పీటర్ శాండర్స్ ఉండి ఉంటే తెలుగునాట రంగమూ వెస్టెండ్ సరసన నిలబడే నాటక సుక్షేత్రమయేది. నా బాధ – యిప్పటికీ అటువంటి ప్రణాళిక మీద ఎవరికీ దృష్టిలేదని.

రాయల్ షేక్స్పియర్ థియేటర్ ప్రధాన పోషకురాలు ఎలిజబెత్ రాణి. భారతదేశంలో రాష్ట్రపతి పేరుతో ఏ నాటక సంస్థకయినా ఊహించగలమా? 420 సంవత్సరాల కిందటి ఏజ్ యు లైకిట్ షేక్స్పియర్ నాటకం చూడాలంటే మీరివాళ ఇంగ్లండు ప్లేనెక్కండి. మరి "మృచ్ఛకటిక" నాటకం చూడాలంటే ఎక్కడికి వెళ్ళాలో దయచేసి అడ్రసు చెప్పండి.

సరే, మళ్ళీ రాఘవ స్మారక నాటకోత్సవ వైభవం దగ్గరకి వద్దాం.

ఆఖరి రోజు పీసపాటి బృందం ఏ హరిశ్చంద్ర. ఏ పాండవోద్యోగ విజయాలో ప్రదర్శించేది. ఆ ఒక్క నాటకాన్ని చూడడానికే అలమండ, కోరుకొండలాంటి దూరపు ఊళ్ళనుంచి బళ్ళు కట్టించుకుని వచ్చేవారు ప్రేక్షకులు. వారు చదువుకున్న వారు కాదు. రైతులు, వ్యాపారులు, మామూలు మనుషులు. అయినా కేవలం ఆ నాటకం మాత్రం చూడడానికే సీజన్ టిక్కెట్లకి డబ్బు ఇచ్చేవారు. దాదాపు ఆ విరాళాలతోనే ఔత్సాహిక నాటక పోటీలు సాగేవి. బళ్ళు పూసుకుని ఆనందంగా వచ్చి, ఆ ఒక్క నాటకం చూసి చుట్టలు వెలిగించుకుని, తృప్తిగా తమ ఊళ్ళకి మరలిపోయేవారు. మన పౌరాణిక నాటకాలకు లాయడ్ వెబ్బర్లతో పనిలేదు. జాతి జీవనంలో నలిగిన పౌరాణిక యితివృత్తాల స్పృహ. పద్యాల రుచి మరిగిన సామాజికులు ఆ నాటకరంగాన్ని పోషించారు. ఇప్పటికీ పోషిస్తూనే ఉన్నారు. నాటకం రాత్రి పదిగంటలకి ప్రారంభమయి తెల్లవారుఝామున ముగిసేది. నాటకం ముగిశాక పోటీల ఫలితాలు, బహుమతి ప్రదానం. అప్పటికి ఔత్సాహిక నటీనటులు కొద్దిపాటి ప్రేక్షకులు ఉండేవారు. అంతా అయేసరి భళ్ళున తెల్లవారేది.

పౌరాణిక మాధుర్యంతో రంగరించి రంగస్థలాన్ని అమృతమయం చేసేవారు పీసపాటి. ఆ రోజుల్లో ఆ వైభవాన్ని

చూడడమే అదృష్టమయితే మరో 43 సంవత్సరాల తర్వాత నేను గిరీశంగా, పీసపాటి నా అన్నగారు లుబ్ధావధాన్లుగా 'కన్యాశుల్కం' నాటకాన్ని, గురజాడ రాసినట్టు యధాతధంగా నటించే అవకాశం దొరికింది. అప్పుడు నా వయస్సు 68. ఆయన వయస్సు 86. అదొక గొప్ప అదృష్టం. ఆ నాటకం దర్శకుడు అప్పటి రాఘవ స్మారకోత్సవాల నటుడు రావికొండలరావు.

ఆ ఉత్సవాల తర్వాత కె.వెంకటేశ్వరరావు నన్ను తియ్యటి జ్ఞాపకాలతో బంధించి వెంటాడుతూనే ఉన్నాడు. ఆ రోజుల్లో బాటా మణిగారని తమిళులు విశాఖపట్నంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ ఉత్సవాలకి వచ్చిన వెంకటేశ్వరరావుని నాకు పరిచయం చేశారు. వెంకటేశ్వరరావు సమక్షంలో నిలబడితేనే గొప్ప ఆనందం కలిగేది అద్భుతమయిన స్టేజ్ ప్రెసెన్స్ వున్న మహానటుడు వెంకటేశ్వరరావు. నేను ఆవేశపడి, ఆయన్ని కలుసుకున్నందుకే పరవశమయిపోయి, ఏం చెప్తున్నానో తెలీని అపస్మారంలో 'నాతో ఓ నాటకం రయించండి' అన్నాను .వెంకటేశ్వరరావు విచిత్రంగా, ఏమీ తడుముకోకుండా, ఆలోచించకుండా 'యూజీనీ ఓనీల్', 'బియాండ్ ది హొరైజన్' చదవండి" అన్నారు. ఎగిరి గంతేశాను నా గురించి ఏమీ తెలియకుండానే ఎలా చెప్పారు? తర్వాత అర్థం చేసుకున్నాను. వెంకటేశ్వరరావుకి తనని గురించి తనకి తెలుసు. తన సామర్థ్యం తెలుసు. రాయిని మాణిక్యం చెయ్యగల పనివాడు వెంకటేశ్వరరావు. అది నిజంగా మాణిక్యమయితే దాని అదృష్టం. ఓ గొప్ప రచనకికాదు. జీవితాంతం మా ఇద్దరి మధ్యా నిలిచిన ఓ గొప్ప బంధుత్వానికి, సాహచర్యానికి అది ప్రారంభం.

ఆ రోజు యూనివర్శిటీలో యూజీనీ, ఓనీల్‌ని పట్టుకున్నాను. ఆయన నోబెల్ బహుమతి పుచ్చుకున్న మహా రచయిత అని నాకు తెలీదు. ఆయన డిజైర్ అండర్ ది ఎలమ్స్, మార్నింగ్ బికమ్స్ ఎలెక్ట్రా లాంటి నాటకాల గురించి అప్పుడే వినడం. బియాండ్ ది హొరైజన్ దాదాపు కంఠస్థం చేసేశాను. ఎన్నిసార్లు చదివానో. అప్పట్లో ఢిల్లీలో ఏషియన్ థియేటర్ ఇన్‌స్టిటిట్యూట్ స్కాలర్‌షిప్ మీద ఇద్దరు చదువుకు వెళ్ళారు – వెంకటేశ్వరరావు, పొట్టి ప్రసాద్. అప్పుడు ఢిల్లీలో జరిగిన వింటర్ ఫెస్టివల్‌లో ఓనీల్ నాటకాన్ని వెంకటేశ్వరరావు చూశాడు. వెంటనే నాకు సూచించడానికి అది ప్రోద్బలం. ఎన్ని విడతలుగా ఆ నాటకాన్ని రాశానో చెప్పలేను.

వీటన్నిటి మధ్యా నా చదువు ఎంత చక్కగా సాగిందో ఊహించవచ్చు. అయితే మూడో సంవత్సరం ముగింపుకు వస్తున్న కొద్దీ నాలో భయం ప్రారంభమయింది. బీయస్సీ ఆనర్స్ పరీక్షలకి వెళ్ళే అవకాసం ఒకే ఒక్కసారి మళ్ళీ రాసే అవకాశం లేదు. అప్పటికే ఒక సున్న, 28 మార్కుల జాబితా నా కళ్ళముందుంది. క్లాసులో చెప్పే పాఠాలు ఏవీ తలకెక్కేవి కావు. ఈ చిత్రవధ ఇలా ఉండగా ఆ సంవత్సరం 'షేక్స్‌ఫిరినా' కంపెనీని ఆహ్వానించారు గోపాలస్వామిగారు. జెఫ్రీ కెండాల్ ఆ కంపెనీ ప్రయోక్త. ఆయన కూతురు జెన్నిఫర్ (తర్వాత '36 చౌరంగీ లేన్' సినిమా దర్శకురాలు). ఆయన

అల్లుడు శశికపూర్. సన్నగా, నాజూగ్గా బొమ్మలాగ ఉండేవాడు. మా క్లాస్ రూం యూనివర్శిటీ ఆరుబయలు రంగస్థలానికి ఎదురుగా ఎర్కసన్ స్క్వేర్‌లో రోజూ ఉదయం కెండాల్, బృందం వచ్చి రాత్రి నాటకానికి సెట్ ఏర్పాటు చేసుకునేవారు. నా దృష్టంతా అక్కడే ఉండేది. ఇక చదువేం సాగుతుంది. ఆరోజుల్లో కెండాల్ భార్య గర్భవతి. కనుక ప్రదర్శించిన అన్ని నాటకాల్లో హీరోయిన్ వేషం తండ్రితో కూతురు జెన్నిఫరే నటించేది. ఇంగ్లీషు నాటకాల్లో ముద్దు పెట్టుకోవడం సామాన్యం. కాని నటించేది తండ్రీ కూతురు. అన్ని నాటకాల్లోనూ, ముద్దు పెట్టుకోవలసిన అన్ని సందర్భాల్లోనూ అన్ని రకాలుగా ముద్దుని దాటేసే లేదా చాటేసే నటనని రూపు దిద్దారు కెండాల్. అప్పుడు చూసిన ఆరు నాటకాలూ జీవితంలో మరిచిపోలేనివి. రెండు షేక్స్‌ఫియర్ నాటకాలు హెన్రీ వి, మాక్‌బెత్, మూడు బెర్నార్డ్ షా నాటకాలు – కాండిడా, పిగ్మాలియన్, సెయింట్‌జోన్ పాట్రిక్ హామిల్టన్ 'గాస్‌లైట్ '.

ఆ తర్వాత సర్ లారెన్స్ అలీవియర్ 'మాక్‌బెత్ ' చూశాను. రెక్స్‌హారిసన్ 'మై ఫెయిర్ లేడీ' (సిగ్మాలియస్ ఆధారంగా రూపొందిన సంగీత రూపకం), చార్లెస్ బోయర్, ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ నటించిన 'గాస్‌లైట్' చూశాను. ఏమయినా 'కెండాల్' నా మనస్సు మీద వేసిన ముద్రని ఎవరూ చెరపలేకపోయారు. అంతకంటే ఎక్కువ ఆనందాన్ని యివ్వలేకపోయారు. ఆ దశలో అపూర్వమయిన తెలుగు ఆధునిక నాటకాన్ని, అభివృద్ధికి పరాకాష్టలో ఉన్న ఆంగ్లనాటకాన్ని చూడగలగడం ఒక గొప్ప ఎక్స్‌పోజర్.

అప్పటికి మా నాన్నగారికి నా శీతకన్ను అర్ధమయింది. ఆయనకి మనస్సులో ఏమూలో నా వ్యాపకం మీద చిన్న సానుభూతి ఉండేదేమో. ఏమయినా నన్ను ఒంటరిగా కూర్చోబెట్టి 'ఈ చదువుని ఒక దారిని తీసుకురావడం నీ బాధ్యత' అని గుర్తు చేశారు .నాకూ అదే అనిపించింది. కాని యిన్ని సున్నాలతో యింత బృహత్తరమయిన చదువుని మూడు సంవత్సరాల అధ్యయనాన్ని మూడు నెలలో అపోశన పట్టడం ఎలాగ? పరీక్ష రాయడం మానేద్దామా అన్న ఆలోచన వచ్చింది. మానేస్తే ఇంకా ప్రమాదంలో పడతాను. మరుసటి సంవత్సరానికి సబ్జెక్టుతో ఈ మాత్రం పరిచయం కూడా పోతుంది. తాడో, పేడో యిప్పుడే తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చాను. 'పేడే'నని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అయినా తప్పదు.

ఆనర్స్‌లో మేం తొమ్మిదిమంది సహాధ్యాయులం. అందులో యూనివర్శిటీలో అతి పేరున్న నటుడూ, క్లాసులో అతి దారుణమయిన స్థితిలో ఉన్న విద్యార్థీ నేనే. మా సహచరులలో కె.వి రంగారావు అనే మిత్రుడు గుంటూరు వాస్తవ్యుడు ఉన్నాడు .మనిషి చాలా సౌమ్యం. పెద్ద మేధావి కాదు. అయినా నా స్థితిలో లేడు. అతనికి నేనంటే సానుభూతి ఉండేది. 'వినయ విహార్' హాస్టల్‌లో అతని గదికి చేరాను. ఆ ఫ్లోర్‌లోనే మరో ఇద్దరు మిత్రులుండేవారు. తెలుగు ఆనర్స్ చదువుతున్న జి.భాను, కొలకలూరి ఈనాక్. ఈనాక్ రచయిత. తరువాత వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైచ్ ఛాన్సలర్‌గా

పదవీ విరమణ చేశాడు. మేం 'ఒరేయ్' అనుకునేంత సన్నిహిత మిత్రులం.

సబ్జెక్టులో కొన్ని బండ గుర్తులు పెట్టి, అర్ధమయినా కాకపోయినా బుర్రకెక్కించుకునే కొన్ని అంశాలు రంగారావు నాకు సిద్ధం చేశాడు. కంప్యూటర్‌లో ప్రింట్ డాక్యుమెంట్ ఫార్మాట్ అని ఉంటుంది. అది యథాతథంగా విషయాన్ని ముద్రవేస్తుంది. దానిలో అక్షరం మార్పుకి ఒప్పుకోదు. దాన్ని అలాగే వాడాలి. నా మెదడులో అలాంటి ఆరని శృతి చేశాను. ఆ మూడు నెలలూ రాత్రీ పగలూ తేడాలేదు. బయట ప్రపంచం తెలీదు. మా చదువు ఆ సబ్జెక్టులో ఆఖరి దశ. ఆ తర్వాత కొత్త పరిశోధన తప్ప మరేదీలేదు. అప్పుడే జర్మనీలో ననుకుంటాను – షాండిగర్స్ వేవ్ ఈక్వేషన్ కనుక్కున్నారు. ఇప్పుడేమిటి? అప్పుడే అదేమిటో నాకు తెలీదు. అది దాదాపు 45 పేజీల ఈక్వేషన్. కాలకూట కషాయం. ఆ సబ్జెక్టులో అంతకన్నా ఎవరైనా అడగాల్సిన ప్రశ్న మరొకటి ఉండదు. అదే వ్రాయాలి. హాస్టల్ నేలంతా సుద్దముక్కలతో రాసి ప్రాక్టీస్ చేశాను. మేధస్సుతో పనిలేదు. కేవలం ధారణ. 45 పేజీలూ యధాతథంగా పేపర్లో దించేశాను. పరీక్షలయాక మా ప్రొఫెసర్ వెంకట్రాయుడుగారు నా ఆన్సర్ పేపర్ చూసి ఆశ్చర్యపోయారు. మనస్సులో తృప్తిగా కూడా ఉండే ఉంటుంది. పేపరు చేతికిచ్చి 'నువ్వే మార్కులు వేసుకో' అన్నారు. నేను పూర్తి మార్కులు – అర్హతతోనే వేసుకున్నాను. ఇదొక మధురమయిన అనుభవం. నా ఆన్సర్ పేపరుకి నేనే మార్కులు వేసుకోవడం.

ఏమయినా, చివరికి అత్తెసరు మార్కులతో బయటపడ్డాను. అందునా మరో 8మార్కులు తక్కువయాయి. అవి గోపాలస్వామిగారి పుణ్యాన వైస్ ఛాన్సలర్ వి.ఎస్ కృష్ణగారి సిఫారసుతో భర్తీ అయి నా డిగ్రీని సంపాదించి పెట్టాయి. ఎప్పుడు నా పేరు చివర డిగ్రీ చూసుకున్నా పెద్ద ఉపద్రవం నుంచి బయటపడిన జ్ఞాపకాలే మనస్సులో కదులుతాయి.

సంవత్సరాలు గడిచాక – ఆ మూడు సంవత్సరాల చదువూ చివరికి ఏమవుతుందోనన్న భయం నిద్రలో యిప్పటికీ అప్పుడప్పుడు పీడకల అవుతూంటుంది. భయంతో త్రుళ్ళిపడి లేస్తాను. ఆ గండం గడిచిపోయిందిలే అని నిట్టూరుస్తాను.

ఆనర్స్‌లో చేరగానే ఆ సంవత్సరం ఆంధ్రాభ్యుదయోత్సవాలలో నాటకాల్లో నటించడానికి ధరఖాస్తు పెట్టాను గోపాలస్వామిగారింట్లో. ఆయన సమక్షంలో పరీక్ష. అప్పటికే ఊళ్ళో నా నాటక సమాజం సాగుతోంది. మమ్మల్ని ఎంపిక చేసే బృందంలో వంకాయల లక్ష్మణరావుగారనే లా కాలేజీ రీడర్ డాక్టర్ బి.యన్.మూర్తిగారూ ఉన్నారు. వారిచ్చిన సంభాషణలు సరిగ్గా చెప్పలేకపోయినా నేను రాసుకున్న ఏకపాత్రాభినయం (శాస్త్రిగారి జ్యోతిషం) బాగా చెయ్యగలిగాను. మొత్తం మీద నేను ఎంపికయాను.

యూనివర్శిటీలో నటించిన మొదటి నాటిక శ్రీ వాత్సవ రచించిన 'స్నానాల గది' హాస్యనాటిక. అందులో నటించిన మరో వ్యక్తి మోదుకూరి జాన్సన్. ఆనాటిక ప్రయోక్త స్వయంగా గోపాలస్వామిగారే రోజూ ఆయన ఇంటి వరండాలోనే

రిహార్సల్స్. వచ్చి ఎదురుగ్గా కుర్చీ వేసుకుని కూర్చునేవారు.

స్నానాల గది ప్రదర్శనకి మా అమ్మ, మా తమ్ముడు బస్సులో వచ్చారు. ఇంటికి వస్తూ అమ్మని అడిగాను నాటిక ఎలాఉందని. 'అందరూ వొంటినిండా బట్టలేసుకున్నారు. నీకు లేదు. అందర్లోకీ నువ్వే నీరసంగా కనిపించావు.' యిదీ ఆమె సమీక్ష. తల్లి కొడుకునే చూసింది పాత్రను చూడలేదు. జీవితమంతా నేనెన్ని గొప్ప రచనలు చేసినా, ఎంత గొప్పగా నటించినా అలిసిపోయే కొడుకునే చూసేది. పరపతినీ, పైకాన్నీ చూసేది కాదు. కాగా "ఇప్పటికి సంపాదించింది చాలు – ఇక రెస్ట్ తీసుకో" అనేది. నా జీవితంలో నా విజయాలన్నీ ఓడిపోయింది ఒక వ్యక్తి సమక్షంలో – మా అమ్మ. నాకు చాప్లిన్ తల్లి జ్ఞాపకం వస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతిని సాధించాక చాప్లిన్ తల్లిని అడిగాడు "ఇప్పుడు నీ కొడుకు గురించి ఏమనిపిస్తోంది" అని.

"ఇవన్నీ నీకు తృప్తినిస్తాయనుకుంటాను" క్లుప్తంగా యిదీ ఆమె సమాధానం.

మరుసటి సంవత్సరం 'కుక్కపిల్ల దొరికింది' నాటిక వేశాను. జియాలజీ రీడర్ నరసింగరావుగారు దర్శకులు. ఆ నాటిక అప్పటికే నాకు నల్లేరు మీద బండి. ఎన్నో సార్లు ప్రదర్శించి ఉన్నాను. మూడో సంవత్సరం పినిశెట్టి 'ఆడది', వంకాయల లక్ష్మణరావుగారు దర్శకులు. ఆ నాటికనుంచి నన్ను అంతర్విశ్వవిద్యాలయ నాటకపోటీలకి ఢిల్లీలో జరిగే యూత్ ఫెస్టివల్‌కి ఎంపిక చేశారు. అక్కడ భమిడిపాటి రాధాకృష్ణ 'మనస్తత్వాలు' నాటిక ప్రదర్శన. అత్తిలి కృష్ణారావు, విజయవాడ నుంచి వచ్చిన శివలెంక అమృతలింగ శాస్త్రి సహనటులు. ఢిల్లీ వెళ్ళేముందు ఆంధ్రా యూనివర్శిటీలో ప్రదర్శించాం. ఢిల్లీలో ఆంధ్రా అసోసియేషన్ పక్షాన ఓ ప్రదర్శన యివ్వడం రివాజు. అప్పటి సంస్థ అధ్యక్షులు వి.వి.గిరిగారు. వారూ మా నాటకాన్ని చూశారు. తెలుగు ప్రేక్షకులూ ఆనందించారు. అటు తర్వాత ఢిల్లీ టలక్‌టోరా గార్డెన్ ఆరు బయలు రంగస్థలంలో ప్రదర్శన. డాక్టర్ బి.ఎన్.మూర్తిగారు మా యూనివర్శిటీ బృందం ఇన్‌ఛార్జి. ఢిల్లీ ప్రయాణానికి ముందే అంతర్విశ్వవిద్యాలయ రేడియో నాటిక రచనా పోటీలకి ఆహ్వానం వచ్చింది. ఎవరితోనూ సంప్రదించడానికి వ్యవధిలేదు. గోపాలస్వామిగారు నన్ను అడిగారు. నేను నాటికని సిద్ధం చేస్తానన్నాను. ఆయన అంగీకరించారు. ఆ విధంగా 'అనంతం' బరిలోకి దిగింది. విజయవాడ రేడియో స్టేషన్‌కి వెళ్ళి రికార్డు చెయ్యాలి. విశ్వవిద్యాలయం డబ్బు సమకూర్చింది. రేడియో కేంద్రంలోకి వెళ్ళడం నాటికను రికార్డు చెయ్యడం అదే మొదటిసారి. దుర్గాచలం అనే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ మా నాటికని రికార్డు చేశారు. అప్పుడు రికార్డింగు దగ్గరకి వచ్చి నిలిచిన మరొక వ్యక్తి – రచయిత్రి లత. రికార్డింగు అంతా మధ్యలో ఆపకుండా ఒకేసారి చెయ్యాలన్నారు దుర్గా చలంగారు. అలా చెయ్యనక్కరలేదని తర్వాత నేను రేడియోలో చేరాక గ్రహించిన విషయం. అయితే స్టేజి నటులకు యిబ్బంది ఏముంది? చేసేశాం. అందులో చలమయ్య పాత్ర. ఇప్పుడు నరసాపూర్‌లో పేరు మోసిన న్యాయవాది మిత్రుడు నిడుబ్రోలు రామచంద్రరావు. అక్కడినుంచి సరిగ్గా

నాలుగేళ్ళకి నేను రేడియోలో చేరడం. వీరందరితో కలిసి పనిచెయ్యడం జరిగింది. ఆ చరిత్ర మరొక 20 సంవత్సరాలు.

మేం ఢిల్లీ యువజనోత్సవాలకి చేరేసరికి – నా 'అనంతం ' నాటికకి అంతర్విశ్వ విద్యాలయ నాటిక రచనా పోటీలలో ఉత్తమ రచన బహుమతి వచ్చిందనీ, రచయిత తరపున ఎవరైనా వచ్చి సమాచార శాఖ మంత్రిగారి చేతులమీదుగా బహుమతిని అందుకోవచ్చునని రేడియో ప్రతినిధి యువజనోత్సవాలకి వచ్చి తెలిపారు. రచయితే అక్కడ ఉన్నట్టు వారికి తెలిసింది. నా ఆనందానికి అంతులేదు. బహుమతి ప్రదానోత్సవం పార్లమెంట్ స్ట్రీట్‌లో ఆకాశవాణి భవనంలో ఇచ్చేది అప్పటి సమాచార ప్రసర శాఖమంత్రి డాక్టర్ బి.వి.కేస్కర్‌గారు. ఆ సభకి కోటు వేసుకు రావాలన్నారు రేడియో ఉద్యోగులు. అప్పటికప్పుడు ఢిల్లీలో కోటు ఎలా వస్తుంది? కె.వెంకటేశ్వరరావు (అప్పుడు ఏషియన్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నాడు) తన కోటు చలవ చేయించి యిచ్చాడు. మిత్రులు పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు అప్పట్లో రైల్వేలో పనిచేసేవారు. ఆయన తన సైకిలు మీద నన్ను ఆకాశవాణి భవనానికి తీసుకొచ్చారు. మా బృందం వారు ఒక్కరు – ఒక్కరు కూడా రాలేదు. తెలుగువారు కదా! ఆనాటి బహుమతి ప్రదానోత్సవంలో మారుతిరావు బహుమతినందుకోగా తెలిసి చప్పట్లు కొట్టిన ప్రేక్షకులు ఆడియన్స్‌లో ఇద్దరే – వెంకటేశ్వరరావు, పురాణం. అదొక గొప్ప మజిలీ నా జీవితంలో. ఆ బహుమతి విలువ అప్పట్లో 150 రూపాయలైనా, ఉత్తరోత్తరా నన్ను చాలా సోపానాలను ఎక్కించింది. కాగా నా సామర్ధ్యానికీ, కృషికీ అది ఆ దశలో సాధికారికమైన సాక్ష్యం.

యువజనోత్సవాలలో మా యూనివర్శిటీ చాలా అంశాలలో పోటీ చేసినా బహుమతి గెల్చిన ఒకే ఒక్క అంశం నాటిక అదిన్నీ నా నాటిక 'అనంతం', ఒకే ఒక్క అవార్డు గ్రహీత మారుతీరావు. మన తెలుగువాళ్ళకి అభినందించడం తెలీదు. పోనీ అలవాటు లేదు. కాకపోతే ఆ విజయం నన్ను గోపాలస్వామిగారి అభిమానగణంలో ముందు నిలిపింది. అది సామాన్యమయిన గణన ఏమీకాదు. నాకు నా డిగ్రీని సంపాదించిన విజయం.

జీవితంలో ప్రతీ సంఘటనకీ వెంటనే ప్రతిఫలం దక్కకపోవచ్చు. కాని దాని ప్రభావం తప్పనిసరిగా కనిపిస్తుంది. గీతాకారుడి ఉవాచ అనుభవంలోకి రావడానికి ఒక జీవితకాలం పట్టింది. ఎన్ని శతాబ్దాల విజ్ఞానికి వడపోతో భగవద్గీత.

ఆ ఉత్సవాల్లోనే ఓ రాత్రి మిత్రులంతా ఢిల్లీ చలిలో వెళ్ళి చూసిన ఓ కళాఖండం – మధుమతి. 46 సంవత్సరాల తర్వాత నా మనుమరాలి ఆరంగేట్రానికి ముఖ్య అతిధి వైజయింతిమాల. ఆమెకి మధుమతి అనుభవాన్ని, మరీ చిన్నతనంలో చూసిన ఆమె తొలి చిత్రం 'జీవితం' గురించీ గుర్తుచేశాను. నవ్వి 'నేనూ అప్పుడు చిన్నదాన్ని .మా అమ్మమ్మ ప్రోత్సహిస్తే చేశాను. నేనప్పుడు స్కూల్లో చదువుతున్నాను' అన్నారావిడ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments